

ఫర్టిలైజర్ షాప్‌లను తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి నరసింహారావు

## ఫర్టిలైజర్ షాప్‌ల తనిఖీ

మాడ్గుల, మే8: ఫర్టిలైజర్ డీలర్లు రైతులకు ఎరువులు, విత్తనాలను ఎమ్మార్పీ ధరలకే అమ్మాలని, ఎక్కువ ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నరసింహారావు అన్నారు. మండలంలోని గురువారం మాడ్గలలో ఉన్న వడ్ల కొనుగోలు కేంద్రాన్ని, ఆగ్రో రైతు సేవా కేంద్రాలు, మన గ్రోమార్ సెంటర్, ఫర్టిలైజర్ షాపులు, ఇర్విన్, అప్పారెడ్డిపల్లిలో ఫర్టిలైజర్ షాపుల్లో ఉన్న విత్తనాలు, ఎరువుల నిల్వలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ డీలర్లు రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలోని మండల వ్యవసాయ శాఖ అధికారి అరుణకుమారి, విస్తరణ అధికారులు రాజేశ్ నాయక్, ప్రియాంక, ప్రసన్న, ఫర్టిలైజర్ డీలర్లు పాల్గొన్నారు.

## అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి



కేశంపేట ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న యువకులు

కేశంపేట, మే 8: కేశంపేట మండల పరిధిలోని సంతాపూర్ గ్రామ యువకులు అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. 'ఇందిరమ్మ ఇల్లు ఇవ్వరూ' 'అర్హులకు దూరంగా ఇందిరమ్మ ఇండ్లు' అనే శీర్షికన 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో వరుసగా వచ్చిన కథనాలపై స్పందించిన యువకులు మండల పరిషత్ కార్యాలయానికి చేరుకొని ఎంపీడీవోకు వినతిపత్రాన్ని అందజేసి మాట్లాడారు. ఈ సందర్భంగా యువ నాయకుడు నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇల్లు, భూమి లేని పేదలను కమిటీ సభ్యులు ఎంపిక చేయడం లేదన్నారు. కార్యక్రమంలో ఎం.శ్రీనివాస్, శ్రీనివాస్, గోపాల్‌రెడ్డి, వీరేందర్‌నాయక్, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై సంబురాలు




కడ్తాల్, మే 8: భారత సైన్యం నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడం పట్ల, గురువారం మండల కేంద్రంలో యువజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్ ఆధ్వర్యంలో యువకులు సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై జాతీయ జెండాలతో ర్యాలీ తీశారు. అనంతరం పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో పెద్ద ఎత్తున పటాకులు కాల్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లాయక్‌అలీ, నాయకులు కృష్ణ, కుమార్, నాగరాజు, వెంకటేశ్, మహేశ్, రమేశ్, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరానికి విశేష స్పందన



ఆమనగల్లు, మే 8: మై విలేజ్ మాడల్ విలేజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చింతల బాల్‌రాజ్‌గౌడ్ జ్ఞాపకార్థం శృతిలయ కల్చరల్ అకాడమీ, సాయిరాం మెడికల్ ఆధ్వర్యంలో పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 86 మంది రక్తదానం చేసినట్లు నిర్వాహకులు పాపిశెట్టి రాము, చిత్తరంజన్‌దాసు తెలిపారు.

## డ్రైనేజీ పైప్‌లైన్ల పరిశీలన



డ్రైనేజీ లైన్ల నిర్మాణం కోసం జలమండలి అధికారుల తో కలిసి స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ శరత్ చంద్ర

బండ్లగూడ, మే 8: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వైష్ణవి వైయాసిస్ వద్ద జలమండలి అధికారులు డిప్యూటీ జనరల్ మేనేజర్ సౌర్యారెడ్డితో కలిసి కమిషనర్ శరత్‌చంద్ర డ్రైనేజీ లైన్లను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ గతంలో వర్షాలు కురిసినప్పుడు వైష్ణవి వైయా సిస్ ప్రాంతాల నుంచి నీరు చేరుకొని పెద్ద ఎత్తున డ్రైనేజీ లైన్లు పొంగిపొర్లుతున్నాయన్నారు. దీం తో ప్రజలు అనేక ఇబ్బందులు పడేవారని తెలిపారు. ఈ సమస్య శాశ్వత పరిష్కారం కోసం జలమండలి అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ యాదయ్య తదితరులు ఉన్నారు.

## అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

బండ్లగూడ,మే 8: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వ స్థలంలో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని గండిపేట మండల తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డిని హరీశ్‌గౌడ్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గండిపేట మండల పరిధిలోని గంధంగూడలో సర్వేనెంబర్ 62లో అక్రమ నిర్మాణాలు బహుళ అంతస్తులు వెలుస్తున్నాయని తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై చర్య లు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



# పంటల మార్పిడితో.. భూసారానికి మేలు

- రోగకారక జీవుల కట్టడికి దోహదం
- ప్రత్యేక సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

ఇబ్రహీంపట్నం, మే 8 : మరికొన్ని రోజుల్లో వర్షాకాలం పంటల సాగు ప్రారంభమయ్యే నేపథ్యంలో రైతులు ఒకే రకం పంటల సాగుపై దృష్టి సారించకుండా పంటల మార్పిడి విధానంపై దృష్టి సారించాలని వ్యవసాయాధికారులు, వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. ఒకేరకమైన పంటలను సాగుచేయటం వలన భూమిలోని సారం తగ్గిపోవటంతో పాటు క్రిమికీటకాలు ఇంకా వృద్ధి చెందే అవకాశమున్నది. దీని నివారణకు రైతులు ఒకేరకమైన పంటలను సాగుచేయటం విధానానికి స్వస్తి చెప్పి పంటల మార్పిడి విధానాన్ని చేపట్టాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఒకేరకమైన పంటలను సాగు చేయటం వల్ల పొలాల్లో భూసారం తగ్గుతుంది. రోగాలను కలిగించే పురుగుల సంఖ్య బాగా పెరిగి దిగుబడి తగ్గుతుంది. పంటల మార్పిడి వల్ల భూమిలోని పోషకాలు సంవృద్ధిగా అందుతాయి. పంటల మార్పిడితో కలిగే ప్రయోజనాలపై ప్రత్యేక కథనం..

- ఒకేపొలంలో ఒక పంటను వరుసగా పండించటం వల్ల చీడపీల ఉధృతి అధికంగా కావడానికి అనుకూల పరిస్థితులు ఏర్పడుతాయి.
- పురుగు జీవితచక్రం పూర్తి చేసుకుని తీవ్రమైన హాని కలిగించే స్థితికి చేరుకుంటుంది.
- పంట మార్పిడి చేసినప్పుడు పురుగు జీవితచక్రం ఛేదించబడుతుంది. ఎందుకంటే ఒక పంటపై ఆశించే పురుగులు మరొక్క పంటపై ఆశించడం సాధారణంగా జరుగదు.
- వేగంగా వృద్ధి చెందే కొన్ని రకాల పురుగులను పంట మార్పిడి వల్ల అదుపులో పెట్టవచ్చు.
- ఒకే లోతు వ్యవస్థ కలిగిన పంటలను ఉదాహరణకు పత్తి, మిరప మొదలైన పంటలను మార్పిడి చేయకుండా సాగుచేయటం వల్ల ఒకే లోతు పొరల నుంచి పోషకాలు తీసుకోవడంతో నేల నిస్సారమవుతుంది.
- వరి, వేరుశెనక, జొన్న, మొక్కజొన్న వంటి పైర్లు నేలపై పొరల నుంచి పోషకాలను తీసుకుంటాయి.

నేల భౌతిక లక్షణాలు, స్వభావం దెబ్బతినకుండా ఉండటానికి, చీడపీడల అభివృద్ధిని నిరోధించడానికి పంట మార్పిడి తప్పక చేయాలి.

- అప్పుడప్పుడు అవసరాన్ని బట్టి పశుగ్రాసం కోసం గడ్డిజాతిపైర్లు, భూసారాన్ని పెంచడానికి పచ్చిరొట్ట పైర్లు వేసుకోవాలి.

**పంటలు సాగుచేయాల్సిన విధానం..**

- వరి తర్వాత మినుము, పెసర, శనగ వేయటం వల్ల సుడిదోమ, టుంగ్రో వైరస్‌ను నివారించవచ్చు.
- చెరకు తర్వాత వరి వేయటం వల్ల వేరు పురుగును తగ్గించొచ్చు. అలాగే, వరిలో దోమపోటు నివారించవచ్చును.
- పత్తివేసిన పొలంలో జొన్న, మొక్కజొన్న, నువ్వులు, మినుములు వేస్తే లద్దె పురుగు, పచ్చ పురుగులను నివారించవచ్చు.
- జొన్న, మొక్కజొన్న తర్వాత కందిని సాగుచేస్తే కాయ తొలుచు పురుగు ఉధృతి తగ్గుతుంది.
- వరిని సాగుచేసే పొలంలో ముందుగా పప్పుధాన్యాలను సాగుచేయడం వల్ల నేల సారవంతమవుతుంది.
- వేరుశనగలో ఆకుముడతను నివారించేందుకు పప్పుజాతికి చెందిన పైర్లు వేయాలి.
- కంది, మిరప పంటల్లో ఎండు తెగులు నివారణకు జొన్న, మొక్కజొన్న పంటలు సాగుచేయాలి.
- నులి పురుగు సమస్య అధికంగా ఉన్న ప్రాంతాల్లో వేరుశెనగ, మిరప, పొగాకు, వంగపైర్ల సాగును కొన్ని పంట కాలాల వరకు ఆపాలి.
- ఆహార పంటలైన వరి, జొన్న, మొక్కజొన్న, సజ్జ పంటలను పప్పుజాతి పంటలైన పెసర, మినుము, వేరు శనగ సాగుతో మార్పిడి చేయాలి.
- ఆహార వాణిజ్య పంటలను పశుగ్రాస పైర్లతో మరో సారి మార్పిడి చేయడం లాభదాయకం.

**ఒకే రకమైన పంటలకు స్వస్తి పలకాలి**



రైతులు ఒకేరకమైన పంటలు సాగుచేయడం ద్వారా ఆ పంట మొక్కలకు అవసరమైన పోషకాలు తక్కువవుతాయి. రోగకారక పురుగుల ఉధృతి పెరిగి దిగుబడి తగ్గుతుంది. వరుసగా ఒకే పంటను కాకుండా వివిధ రకాల పంటల సాగుతో పురుగుల జీవిత చక్రాన్ని నిలిపివేయవచ్చు. దాంతో రైతులు మంచి లాభాలను పొందగలుగుతారు. రైతులు ఒకేరకమైన పంటల సాగుకు పూర్తిగా స్వస్తి చెప్పి పంటల మార్పిడి విధానానికి శ్రీకారం చుట్టడం ద్వారా మంచి లాభాలు గడించే వీలుంటుంది.

-శ్రవణ్‌కుమార్, ఏఈవో

## కొండారెడ్డిపల్లిలో ఎమ్మెల్సీ పర్యటన



పర్యటిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

కేశంపేట, మే 8: మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ వీధుల గుండా పర్యటించిన ఎమ్మెల్సీ గ్రామ ప్రగతికి కావాల్సిన నిధుల విషయంలో పూర్తిస్థాయి సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం నిర్మాణంలో ఉన్న వీరనాగమ్మ ఆలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శేఖర్‌పంతులు, బీఆర్‌ఎస్ నాయకులు కె.నరేందర్, మల్లేశ్ యాదవ్, ఆంజనేయులు, అమరేందర్‌రెడ్డి, మాధవ్, కుమార్‌యాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులతో సమస్యల పరిష్కారం

కొందుర్గు, మే 8: రెవెన్యూ సదస్సులతో రైతుల భూ సమస్యలను పరిష్కారం అవుతాయని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొందుర్గు మండలంలోని పర్వతాపూర్, చుక్కమెట్ గ్రామాల్లో గురువారం అధికారులు రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతులు, ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతుల భూ సమస్యల పరిష్కారంకోసమే ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేశ్ కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


## మండల వ్యవసాయాధికారికి అదనపు బాధ్యతలు



షాద్‌నగర్‌టౌన్, మే 8: ఫరూఖ్‌నగర్ మండల వ్యవసాయాధికారి నిశాంత్‌కుమార్‌కు గురువారం షాద్‌నగర్ ఏడీఏగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఏడీఏగా పనిచేసిన రాజారత్నం ఉద్యోగోన్నతిపై బదిలీ అయ్యారు. దీంతో మండల వ్యవసాయాధికారి నిశాంత్‌కుమార్ ఏడీఏగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను తోటి ఉద్యోగులు, సిబ్బంది శాలువాతో సన్మానించారు.

# రసాయన ఎరువులను తగ్గించాలి

- ఊరూరా రైతులకు అవగాహన సదస్సులు
- పంటల సాగుపై సూచనలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు




చేవెళ్ల రూరల్ : కుమ్మెర గ్రామంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

చేవెళ్ల రూరల్, మే 8 : రైతులు పంటల్లో యూరియా వాడకాన్ని తగ్గిస్తేనే భూసారం మెరుగు పడుతుందని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు సూచించారు. గురువారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మండల వ్యవసాయ శాఖ సమన్వయంతో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు (రైతులకు అవగాహన) కార్యక్రమాన్ని చేవెళ్ల మండల పరిధి కుమ్మెర, గొల్లపల్లి, శంకర్‌పల్లి మండల పరిధి ఎర్వగూడ గ్రామాల్లో నిర్వహించారు. కుమ్మెరలో వ్యవసాయ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్, డా.వి.రమ్య, గొల్లపల్లిలో సీనియర్ శాస్రవేత్త ఎం.ప్రమీల, ఎర్వగూడలో మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, శాస్త్ర వేత్త లక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంటల్లో యూరియా వాడకం తగ్గించడం వల్ల నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, పంట మార్పిడి చేయడంతో చీడపీడలను తగ్గించవచ్చని సూచించారు. అదే విధంగా పుట్టగొడుగుల పెంపకం, గులాబీ సాగులో చీడ పీడల నివారణ గురించి వివరించారు. కార్యక్రమాల్లో చేవెళ్ల ఏడీఏ సురేశ్ బాబు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు కవితాకిరణ్, సిహెచ్. స్నేహలత, చేవెళ్ల ఏవో శంకర్‌లాల్, ఏఈవోలు బాలకోటేశ్వర్, ప్రతిభ, మనీష, మల్లేశ్, రైతులు, విద్యార్థులు, కె.రాజేశ్, ఎం.అపూర్వ, ఎస్.కౌసల్య, కె.గిరిబాబు పాల్గొన్నారు.

**సోలిపేట్, లక్ష్మారావుగూడలో..**

షాబాద్, మే 8: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని గురవారం షాబాద్ మండలంలోని సోలిపేట్, లక్ష్మారావుగూడలో నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు శిరీష, అర్చన, సతీశ్ మాట్లాడుతూ.. రైతులు వివిధ పంటల్లో ఆచరించాల్సిన సమగ్ర యాజమాన్యపద్ధతులు, సాగు ఖర్చు, నేల తల్లి ఆరోగ్యం, పంట మార్పిడి ఉపయోగం, చెట్ల పెంపకం, కంది, పత్తి, క్యారెట్, వరి, చిక్కుడు, టమాట పంటల్లో యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలపై పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏవో వెంకటేశం, ఏఈవో గీత, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్, విశ్వవిద్యాలయం రీసెర్చ్ స్కాలర్స్ అవనిజ, ఉమ, ప్రవీణ్‌కుమార్, స్నేహ, రైతులు పాల్గొన్నారు.

**భూమిని బట్టి మందులు వాడాలి**

కడ్తాల్ : రైతులు భూమిని బట్టి తగిన మోతాదులో రసాయనాలను వాడుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు అనిత, సుప్రజ, విద్యాసాగర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని రావిచేడ్ గ్రామంలోని రైతు వేదికతోపాటు, టాక్‌రాజ్‌గూడలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాలకు చెందిన రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు మాట్లాడుతూ పంటల సాగులో నాణ్యమైన విత్తనాలను వాడాలని తెలిపారు. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగానే పంటలను సాగు చేసుకోవాలని పేర్కొన్నారు. అధిక దిగుబడి కోసం సంప్రదాయ పద్ధతులైన పచ్చి రొట్ట ఎరువులు, వర్మీకంపోస్టును వినియోగించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీలత, ఏఈవోలు శ్రీకాంత్‌రెడ్డి, కష్యభ్, అనూష, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ గోపాల్, మాజీ సర్పంచ్ విఠలయ్యగౌడ్, నాయకులు బాలకృష్ణ, జితేందర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, ధర్మానాయక్, శ్రీనునాయక్, రైతులు పాల్గొన్నారు.



షాబాద్ మండలం సోలిపేట్‌లో మాట్లాడుతున్న శాస్త్రవేత్త శిరీష

**డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలి**

ఆమనగల్లు : విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు నిర్మల, సుజాత తెలిపారు. గురువారం మండల పరిధిలోని ఆకుతోటపల్లి రైతు వేదిక భవనంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి వ్యవసాయ శాస్త్రవేత్తలు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించే సేంద్రియ వ్యవసాయం చేయాలని సూచించారు. అదే విధంగా మార్కెట్‌కు అనుగుణంగా పంటలు పండించాలని, రసాయనికాలు, క్రిమిసంహాకారాలు ఎక్కువ వాడవద్దని అవసరం మేరకే పురుగుమందులు వాడాలని వారు రైతులకు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి అరుణకుమారి, విస్తరణ అధికారులు భూదేవి, మీనాక్షి, నికిత, కేదార్ యూనివర్సిటీ విద్యార్థులు స్వప్న, తరుణ్, ఆయిల్ పామ్ కో ఆర్డినేటర్ హిమకుమార్, మాజీ జడ్పీటసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ నారాయణ, రైతులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా కృష్ణారెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న కృష్ణారెడ్డి

బండ్లగూడ, మే 8. రాజేంద్రనగర్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా కృష్ణారెడ్డి గురువారం బాధ్యతలను స్వీకరించారు. అంతకుముందు ఇక్కడ డిపో మేనేజర్‌గా పని చేస్తూ వేణుగోపాల్ హైదరాబాద్ వన్‌డిపోకు బదిలీపై వెళ్లారు. వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కృష్ణారెడ్డి పేర్కొన్నారు.

## సెంట్రింగ్ కార్మికులకు మద్దతివ్వాలి

శంషాబాద్ రూరల్, మే 8 : భవన నిర్మాణ రంగంలో సెంట్రింగ్ రంగం కీలకమని, ఆ రంగ కార్మికులకు అన్ని వర్గాల నుంచి మద్దతు వస్తుందని ప్రజాప్రతినిధులు సైతం తమకు సహకరించాలని కోరుతూ గురువారం ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను శంషాబాద్ మండల సెంట్రింగ్ కార్మికుల సంఘం నాయకులు కలిసి వినతిపత్రం అందజేశామని కార్మికులు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కార్మికుల సంఘం అధ్యక్షుడు చంద్రయ్యముదిరాజ్‌తో పాటు పలువురు కార్మికులు ఉన్నారు.

## బీసీసేన మహిళా కమిటీల ఎన్నిక



మహిళా కమిటీకి నియామకపత్రం అందజేస్తున్న బీసీసేన నేతలు

కొందుర్గు, మే 8: మండలంలోని వనంపల్లి, గుర్రంపల్లి గ్రామాల్లో బీసీసేన మహిళా కమిటీలను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీసీసేన చౌదరిగూడ మండల మహిళా అధ్యక్షురాలు జయశ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వనంపల్లి అధ్యక్షురాలిగా మమత, గుర్రంపల్లి గ్రామ అధ్యక్షురాలిగా రమాదేవిని ఎన్నుకొని నియామకపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీసేన జిల్లా ఉపాధ్యక్షుడు ప్రశాంత్, లావణ్య, వననీత, అనిత, అనసూయ, లక్ష్మమ్మ, యాదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# కోహెడ రహదారిలో వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు, సీఐ జగదీశ్

ఆదిబట్ల,మే 8ః అనుమానం వచ్చి అనమానిత వ్యక్తులు సంచరిస్తుంటే వెంటనే 100 నెంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కెపీవీ రాజు అన్నారు.గురువారం నాగార్జున సాగర్ హైవే నుండి కోహెడ వెళ్లే రహదారిలో ఇబ్రహీంపట్నం సిఐ జగదీష్ తో కలిసి అనుమానిత వాహనాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతం చెట్లతో నిండి పోయి పెద్ద ఎత్తున గుట్లు ఉండటంతో నిందితులు ఈ ప్రాంతాన్ని దొంగతనాలకు అనువైన ప్రాంతంగా ఎంచుకున్నారని అన్నారు.ఈ ప్రాంతం నుండి ప్రయాణించే వాహనదారులు ఒంటరిగా వెళ్లరాదని అందులో మహిళలు మరింత జాగ్రత్తగా ఉండాలని అన్నారు.ఈ ప్రాంతంలో అర్ధరాత్రి ప్రయాణం చేసే ముందు ఇక్కడ వాహనాలు ఆపకూడదని అన్నారు.ఈ ప్రాంతంలో వ్వరైన అనుమానితులు ఎదురైనప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.ఈ రహదారిలో ప్రతి రోజు పోలీసింగ్ పెట్రోలింగ్ వాహనాలు ఎప్పటికప్పుడు తిరుగుతూ గస్తీ కాస్తూ ఉన్నాయని అన్నారు.అనంతరం ఆ ప్రాంతం గుండా వెళ్లేవాహన దారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం యస్ఐ శ్రీనివాస్ తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## విరిగిపడ్డ చెట్ల తొలగింపు



మండలంలోని కోనాయపల్లి – కొత్తపేట గ్రామాల ప్రధాన రహదారిపై ఇటీవల కురసిన వర్షానికి విరిగిపడ్డ చెట్లను బీఆర్‌ఎస్ నేతలు గురువారం తొలగించి వాహనదారులు, ప్రయాణికుల రాకపోకలకు మార్గం సుగమం చేశారు. వారి వెంట హన్మంత్‌నాయక్, కృష్ణయ్య, తదితరులు ఉన్నారు.

- కేశంపేట, మే 8

## దోపిడీ కేసులో నిందితుడి రిమాండ్



కేసు వివరాలను వెల్లడిస్తున్న సీఐ గంగాధర్

కడ్తాల్, మే 8: మండలంలోని చరికొండ గ్రామంలో జరిగిన చోరీ కేసును ఒక్క రోజులోనే పోలీసులు ఛేదించారు. సీఐ గంగాధర్ వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చరికొండ గ్రామానికి చెందిన గుల్లకుంట మహేశ్ ఈ నెల 7వ తేదీ తన బంధువుల పెండ్లికి హైదరాబాద్ వెళ్తున్నానని, తన పొలం పక్కనే ఉండే నాగిళ్ల మహేశ్‌కు చెప్పాడు. శుభాకార్యానికి వెళ్లిన గుల్లకుంట మహేశ్, నాగిళ్ల మహేశ్‌కు ఫోన్‌చేసి తాను ఇంటికి రావడానికి ఆలస్యం అవుతుందని, పొలం వద్ద ఉన్న తన తల్లిని బైక్‌పై ఇంటి వద్ద దింపాలని నాగిళ్ల మహేశ్‌ను గుల్లకుంట మహేశ్ కోరాడు. ఇదే అదునుగా భావించిన నిందితుడు పొలం వద్ద ఒంటరిగా ఉన్న జంగమ్మపై దాడి చేశాడు. ఆమె అపస్మారకస్థితిలోకి వెళ్లగానే చనిపోయిందని భావించాడు. ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను తీసుకొని, పొలంలోనే ఒక రాయి కింద దాచిపెట్టి అక్కడి నుంచి పరారయ్యాడు. ఇదిలా ఉండగా అదే రోజు రాత్రి 10 గంటల వరకు జంగమ్మ ఇంటికి రాకపోవడంతో గుల్లకుంట మహేశ్.. నాగిళ్ల మహేశ్‌కు ఫోన్ చేయగా, పొంతన లేని సమాధానాలు ఇచ్చాడు. ఆందోళన చెందిన మహేశ్ అదే రాత్రి హైదరాబాద్ నుంచి హుటాహుటిన బయల్దేరి గ్రామానికి చేరుకొని గ్రామస్తులతో కలిసి తన తల్లి ఆచూకీ కోసం పొలంలో వెతికాడు. పొలంలో ఉన్న గడ్డివాములో జంగమ్మ గాయాలతో మూలుగుతూ కనిపించింది. ఏమి జరిగిందని తన తల్లిని మహేశ్, గ్రామస్తులు అడుగగా, నాగిళ్ల మహేశ్ తనపై దాడి చేశాడని అపస్మారక స్థితిలోకి వెళ్లగానే.. రెండు తులాల బంగారు పుస్తెల తాడు, మూడున్నర తులాల నెక్లెస్, అర తులం గొలుసు తీసుకొని పారిపోయాడని వివరించింది. బాధితురాలి కుమారుడు మహేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టి నాగిళ్ల మహేశ్‌ను గురువారం అరెస్ట్ చేసి బంగారం, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. కేసును త్వరగా ఛేదించిన పోలీసు సిబ్బందిని షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి అభినందించినట్లు సీఐ తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు



విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో చర్చిస్తున్న డీఈవో సుశీందర్‌రావు, తదితరులు

శంషాబాద్ రూరల్, మే 8 : బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు ఉపాధ్యాయులకు సూచించారు. బడిబాట కార్యక్రమంలో భాగం గా గురువారం శంషాబాద్ మున్సిపాలిటీలోని శాతంరాయిలో ఇంటింటికీ తిరుగుతూ వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించే విధంగా తల్లిదండ్రులను ఒప్పించిన ఉపాధ్యాయులను అభినందించారు. రెండు రోజులుగా జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు దాదాపు 200 మంది విద్యార్థుల తల్లిదండ్రులను ప్రైవేటు పాఠశాలలకు వెళ్లకుండా ప్రభుత్వ పాఠశాలకు వచ్చే విధంగా తల్లిదండ్రులను ఒప్పించినట్లు పేర్కొన్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై శిక్షణ ఇవ్వను న్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శంషాబాద్ ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి,వెంకటయ్య, లక్ష్మారెడ్డి,స్థానిక నాయకుడు జల్లపల్లి నరేందర్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.